# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 19 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## గ్రూప్-3 ఫలితాలు విడుదల

- 1,370 మందికి ఉద్యోగావకాశం
- సెలక్షన్ లిస్ట్ విడుదల చేసిన టీఎస్‌పీఎస్సీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ గ్రూప్–3 పరీక్ష ఫలితాలను గురువారం విడుదల చేశారు. సెలక్షన్ లిస్ట్‌ను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) అధికారికంగా ప్రకటించింది. ఈ పరీక్ష ద్వారా మొత్తం 1,370 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు వెల్లడించింది.గతేడాది నవంబర్ 17, 18 తేదీల్లో గ్రూప్–3 పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే. జూనియర్ అసిస్టెంట్, లోయర్ డివిజన్ స్టెనోగ్రాఫర్ (ఎల్‌డీ స్టెనో), టైపిస్ట్, జూనియర్ స్టెనోగ్రాఫర్ తదితర పోస్టుల భర్తీ కోసం ఈ పరీక్షను నిర్వహించారు.ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.5 లక్షల మంది అభ్యర్థులు హాజరుకావడం విశేషం. ఫలితాలు విడుదల కావడంతో అభ్యర్థుల్లో ఉత్కంఠకు తెరపడింది. ఎంపికైన అభ్యర్థులు తదుపరి ప్రక్రియకు సిద్ధంగా ఉండాలని టీఎస్‌పీఎస్సీ సూచించింది.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు



- మాకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజల ఆశీర్వాదం
- మా బాధ్యత మరింత పెరిగింది
- బీఆర్ఎస్, బీజేపీ 'కూటమి'కి 33 శాతం స్థానాలే ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికల నిర్వహణ
- ఒక్క రూపాయి దుర్వినియోగం లేకుండా పాలన
- జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై అసెంబ్లీలో చర్చించాకే నిర్ణయం
- ఫిరాయింపు ఎమ్మెల్యేల అంశంపై స్పీకర్‌దే తుది నిర్ణయం
- ఇష్టం లేకుంటే కోర్టుకెళ్లొచ్చు
- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై శాసనసభలో చర్చ
- కేటీఆర్‌కు హరీశ్‌రావు భయం పట్టుకుంది
- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, ప్రజాస్వామిక బద్ధంగా ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించినందుకు ఎన్నికల యంత్రాంగానికి, అధికారులకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ 66 శాతం స్థానాల్ని కైవసం చేసుకున్నదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. 94 శాసనసభ నియోజకవర్గాల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగితే 87 శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్ అత్యధిక ఫలితాలు సాధించిందని వివరించారు. అశీర్వదించిన ప్రజలకు ధన్యవాదాలు, కష్టపడి పనిచేసిన ప్రభుత్వ ఉద్యోగులు, కాంగ్రెస్ కార్యకర్తలకు కృతజ్ఞతలు చెప్పారు. గురువారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర రాజనర్సింహ , ధనసరి అనసూయ సీతక్కతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గాల వారీగా గ్రామ పంచాయతీల్లో పార్టీలు సాధించిన వివరాలను సీఎం మీడియాకు విడుదల చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు ముఖ్యమంత్రి ప్రజలకు క ృతజ్ఞతలు తెలియజేశారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లను సాధించడంపై శాసనసభ సమావేశాల్లో చర్చించి అన్ని పార్టీల అభిప్రాయం మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికలపై నిర?యానికి వస్తామని చెప్పారు. రాష్ట్రంలో 12,728 పంచాయతీలకు గాను 12,702 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరగ్గా, ప్రజాస్వామిక బద్ధంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం, ప్రజలు స్వేఛగా తీర్పును ఇవ్వడం అభినందనీయమని అన్నారు. రాష్ట్రంలోని 12,702 గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ 7,527 మంది, కాంగ్రెస్ రెబల్స్ 808 మంది నెగ్గారనీ, మొత్తంగా తమ పార్టీ 8,335 గ్రామ పంచాయతీల్లో విజయం సాధించి 66 శాతం సీట్లను గెలుచుకుందని విశ్లేషించారు. బీఆర్ఎస్, బీజేపీ కూటమిగా ఈ ఎన్నికల్లో పోటీచేసి 33 శాతం స్థానాలు సాధించాయని ఎద్దేవా చేశారు. కమ్యూనిస్టులు, ఇతరులు 1 శాతం ఫలితాలు సాధించారని తెలి పారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండేండ్ల తర్వాత గ్రామ పంచా యతీ ఎన్నికలు జరిగాయనీ, ప్రజలు పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశార నీ, ఇది ప్రజా పాలనకు ప్రజలు ఇచ్చిన తీర్పు అని చెప్పారు. అలాగే కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లోనూ ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని గుర్తుచేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ 66 శాతం, బీఆర్ఎస్–బీజేపీ కూటమి 33 శాతానికే పరిమితం అవుతాయని జోస్యం చెప్పారు. రెండేండ్ల పాలనలో పేదలకు అందించిన సన్నబియ్యం, ఉచిత కరెంటు, సన్న వడ్లకు బోనస్, రూ.500కే సిలిండర్, ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల ఉచిత కరెంట్, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఎస్సీ వర్గీకరణ అమలు, కులగణన వంటి అనేక పథకాలకు ప్రజలు మద్దతు ఇచ్చారని సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతో పాటు ఏడో గ్యారెంటీగా ప్రజలకు ప్రజాస్వామ్యాన్ని, స్వేచ్ఛను అందించామన్నారు. పూర్తి స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిపించామనీ, హెూదాలను అడ్డుపెట్టుకుని ఎన్నికలను ప్రభావితం చేసేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోలేదన్నారు. ఈ ఫలితాలు తమపై మరింత బాధ్యతను పెంచాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పేరు, విధానాన్ని మార్చి గ్రామీణ ఉపాధిని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని మిగితా 3వ పేజీలో



## వీబీ-జీ రామ్ జీ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

- నరేగా స్థానంలో 'వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా హామీ మిషన్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- విపక్షాల ఆందోళనల నడుమ బిల్లు పాస్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా) స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న 'వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా హామీ మిషన్ – గ్రామీణ్' బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. విపక్షాల తీవ్ర నిరసనల మధ్యే వీబీజీ రామ్‌జీ (VBGRM-G) బిల్లును సభ ఆమోదించింది.బిల్లు ఆమోద సమయంలో విపక్ష సభ్యులు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. కొందరు సభ్యులు బిల్లు ప్రతులను చించి విసిరేయడంతో సభలో ఉద్రిక్తత నెలకొంది. బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

బిల్లుపై చర్చలో భాగంగా మాట్లాడిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అనేక లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాలు కార్మికులపై ఎక్కువగా ఖర్చు చేసి, అభివృద్ధి పనులపై తక్కువగా ఖర్చు చేశాయని విమర్శించారు.

యూపీఏ ప్రభుత్వానికి ముందున్న ప్రభుత్వాలు కూడా నరేగా తరహా ఉపాధి హామీ పథకాలను అమలు చేశాయని ఆయన గుర్తు చేశారు. 2009 ఎన్నికలను ద ృష్టిలో పెట్టుకుని అప్పటి యూపీఏ ప్రభుత్వం నరేగా పథకానికి మహాత్మా గాంధీ పేరు పెట్టిందని ఆరోపించారు.

అలాగే భారత్–పాకిస్థాన్ విభజనకు ఒప్పుకోవడం ద్వారా గాంధీ ఆదర్శాలకు కాంగ్రెస్ పార్టీ తూట్లు పొడిచిందని శివరాజ్ సింగ్ చౌహాన్ తీవ్ర విమర్శలు చేశారు. విపక్షాలు మాత్రం నరేగా పథకాన్ని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ, గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశాయి.

వికసిత్ భారత్ రోజ్‌గార్ ఆజీవికా హామీ మిషన్ (వీబీజీ రామ్‌జీ) బిల్లును వ్యతిరేకిస్తూ విపక్ష పార్టీలు పార్లమెంటు ప్రాంగణంలో నిరసనకు దిగాయి. వెంటనే ఈ బిల్లును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశాయి. 'మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం' అని రాసి ఉన్న భారీ బ్యానర్‌తో గాంధీ విగ్రహం నుంచి మకర ద్వారం వరకు విపక్ష ఎంపీలు ర్యాలీ నిర్వహించారు.ఈ నిరసనలో కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎంపీలు కేసీ వేణుగోపాల్, కనిమొళి, టీఆర్ బాలు, ఏ. రాజా తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం నుంచి మహాత్మా గాంధీ పేరును తొలగించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని చంపేస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వీబీజీ రామ్‌జీ బిల్లును పార్లమెంటు స్థాయి సంఘానికి పంపాలని ఆయన డిమాండ్ చేశారు. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం మహాత్మా గాంధీని అవమానించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక, ఆర్థిక పరివర్తనకు కీలకంగా నిలిచిన పని హక్కును కూడా అణచివేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరాడుతామని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పోస్టు చేశారు. వీబీజీ రామ్‌జీ బిల్లు గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని విపక్షాలు హెచ్చరిస్తూ తమ ఆందోళనను కొనసాగిస్తామని స్పష్టం చేశాయి.

## దళిత యువతిపై లైంగికదాడి.. హత్య

**బలగం టీవి, మహబూబ్‌నగర్**

సర్పంచ్ ఎన్నికల విజయోత్సవ ర్యాలీ జరుగుతున్న సమయంలో దళిత యువతిని దుండగులు లాక్కెళ్లి సామూహిక లైంగికదాడి చేసి.. ఆ తర్వాత హత్య చేసిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలం వేముల గ్రామంలో జరిగింది. బుధవారం రాత్రి 9 గంటల సమయంలో సర్పంచ్ ఎన్నికల విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న దళిత యువతి(21)ను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు రైతు వేదిక భవనంలోకి లాక్కెళ్లినట్లు తెలిసింది. ఆమె కేకలు వేయకుండా నోరును గుడ్డతో మూసేశారు. సామూహిక లైంగికదాడి చేశారు. రెండు మూడు గంటలపాటు హింసించి ఆ తర్వాత చంపేసినట్లు అనుమానాలు వ్యక్తమ వుతున్నాయి. బాధితురాలి కోసం కుటుంబీకులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. మృతదేహాన్ని ఉదయం గ్రామస్తులు గమనించారు. అయితే, విషయాన్ని బయటకు చెప్పడానికి బాధిత కుటుంబం భయపడుతున్నట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి ద్వారా విషయం తెలుసుకున్న కేవీపీఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు మాణిక్యరాజు, జిల్లా ఉపాధ్యక్షులు విష్ణు తదితరులు వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఆందోళన చేశారు. అనంతరం ఫిర్యాదు చేసి.. దోషులు ఎంతటి వారైనా వదిలేది లేదని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మూసాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## భారత్-ఒమన్ మధ్య ఒప్పందం వాణిజ్యాన్ని పెంచుతుంది



- ప్రధాని మోదీ

**బలగం టీవి, మస్కట్**

భారతీయులు ఎక్కడికి వెళ్లినా వైవిధ్యాన్ని గౌరవిస్తారని, అదే భారతీయ సంస్కృతికి బలమైన పునాదని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో భారత్ తన ఆర్థిక డీఎన్ఏను మార్చుకుందని, ఈ మార్పు వల్లే ప్రపంచంలోని అత్యంత పోటీతత్వ మార్కెట్లలో ఒకటిగా ఎదిగిందని అన్నారు. ద్వైపాక్షిక స్వేచ్ఛా వాణిజ్యాన్ని పెంచేందుకు భారత్ కుదుర్చుకుంటున్న సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందాలు (సీఈపీఏ) భాగస్వామ్య దేశాల్లో కొత్త విశ్వాసాన్ని నింపుతున్నాయని చెప్పారు. గురువారం ఒమన్ రాజధాని మస్కట్లో జరిగిన 'భారత్–ఒమన్ బిజినెస్ ఫోరం' సదస్సులో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా గత దశాబ్ద కాలంలో భారత ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక, వాణిజ్య సంస్కరణలు, వాటి ఫలితాలను వివరించారు. జీఎస్టీ, దివాలా–బ్యాంక్ రప్టీ కోడ్ (ఐబీసీ) వంటి విప్లవాత్మక సంస్కరణలతో దేశవ్యాప్తంగా మార్కెట్ ఏకీకరణ జరిగిందని ప్రధాని తెలిపారు. ఐబీసీ ద్వారా సంస్థల్లో ఆర్థిక క్రమశిక్షణ పెరిగి, వ్యాపార కార్యకలాపాల్లో పారదర్శకత మెరుగుపడిందని అన్నారు. ఈ పరిణామాలు భారత మార్కెట్‌పై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచాయని చెప్పారు.

**సీఈపీఏ భవిష్యత్తుకు దారి**

భారత్–ఒమన్ మధ్య కుదిరిన సీఈపీఏ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత పెంచుతుందని మోదీ స్పష్టం చేశారు. ఈ ఒప్పందం అన్ని రంగాల్లో పెట్టుబడి అవకాశాలను వెలికి తీస్తుందని, భవిష్యత్తుకు ఇది బ్లూ ప్రింట్‌లా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. భారత్%–%ఒమన్ దౌత్య సంబంధాలకు 70 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పురోగమిస్తోందని, ఈ మార్పు ఒమన్‌కూ ప్రయోజనకరమని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఆర్థిక వికాసంలో భాగస్వాములు కావాలని ఒమన్ వ్యాపారవేత్తలు, కంపెనీలకు పిలుపునిచ్చారు.

**దీపావళికి యునెస్కో గుర్తింపుపై హర్షం**

మస్కట్‌లో ప్రవాస భారతీయులతో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగిస్తూ, దీపావళి పండుగకు యునెస్కో 'సాంస్కృతిక వారసత్వ' గుర్తింపు లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. భారతీయ దీపాలు ఇప్పుడు ప్రపంచానికే వెలుగులు పంచుతున్నాయని వ్యాఖ్యానించారు.

**కీలక ఒప్పందాలు**

వ్యూహాత్మక సహకారంపై సంయుక్త విజన్ డాక్యుమెంట్‌కు భారత్–ఒమన్ సంతకాలు.

వ్యవసాయ ఆవిష్కరణలు, ఆహార పరిశ్రమల రంగంలో పరస్పర సహకార ఒప్పందం.

సముద్ర వారసత్వం, మ్యూజియంలు, శాస్త్ర%–%సాంకేతికం, నైపుణ్యాభివృద్ధి, వాణిజ్య రంగాల్లో ఒమన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) మధ్య నాలుగు అవగాహనా ఒప్పందాలు.

## ఎన్నికల ఫలితాలతో సీఎంకు ఫ్రస్టేషన్

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు

**బలగం టీవి, హైదరాబాద్**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు తీవ్రస్థాయిలో స్పందించారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత రేవంత్ రెడ్డి తీవ్ర ఫ్రస్టేషన్‌కు లోనయ్యారని విమర్శించారు. రోజురోజుకీ పరిస్థితులు చేజారుతున్నాయన్న వాస్తవాన్ని జీర్ణించుకోలేక అవాకులు చెవాకులు పేలుస్తూ అక్కసు వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. త్వరలోనే తనకు పతనం తప్పదన్న విషయం అర్థమై రేవంత్ రెడ్డి ఆగమాగం అవుతున్నారని, తన కుర్చీ ఊడిపోతుందన్న భయంతోనే ప్రెస్‌మీట్‌లో అడ్డగోలుగా మాట్లాడారని హరీష్ రావు ఆరోపించారు. తనకు, కేటీఆర్ మధ్య విభేదాలు సృష్టించి బీఆర్ఎస్ను బలహీనపర్చాలన్న చీప్ ట్రిక్‌ను రేవంత్ రెడ్డి ఆడుతున్నారని హరీష్ రావు వ్యాఖ్యానించారు. అయితే ఆ చిల్లర రాజకీయాలకు ఎవరూ పడిపోరని స్పష్టం చేశారు. "ఎన్ని సార్లు చెప్పినా మళ్లీ చెబుతున్నా నా గుండెల్లో ఉన్నది కేసీఆర్ నా చేతిలో ఉండేది గులాబీ జెండానే" అని హరీష్ రావు తేల్చిచెప్పారు. రేవంత్ రెడ్డి దాష్టీకాలు, అవినీతి, అసమర్థతపై తానూ, కేటీఆర్ మరింత సమన్వయంతో, రెట్టించిన ఉత్సాహంతో పోరాడతామని హరీష్ రావు తెలిపారు. ఉద్యమ కాలం నుంచి నేటిదాకా తెలంగాణకు ద్రోహం చేస్తున్న కాంగ్రెస్‌ను గద్దె దించుతామని హెచ్చరించారుబీఆర్ఎస్ విజయపథంలో పురోగమించడం ఖాయమని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం, తెలంగాణ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడం తథ్యమని హరీష్ రావు ధీమా వ్యక్తం చేశారు.

## భవిష్యత్తు గెలుపునకు భువనగిరి నుంచే పునాది

- యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం ఖాయం
- తల్లి పాలిచ్చే బర్రెను వదిలి.. తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లుంది కాంగ్రెస్ పాలన
- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యంత గలీజుగా రాజకీయం
- ప్రజా బలంతో పంచాయతీ ఎన్నికల్లో తిరుగులేని విజయం సాధించిన బీఆర్ఎస్
- జిల్లా పరిషత్ ఎన్నికలకు సిద్ధం కావాలి



**బలగం టీవి, యాదాద్రి భువనగిరి బ్యూరో**

బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం ప్రారంభమైందని, భవిష్యత్తులో సాధించబోయే అఖండ విజయాలకు యాదాద్రి భువనగిరి జిల్లా గడ్డ పునాది వేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులతో ఆత్మీయ సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు.జిల్లా పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపారు.

పెద్దలు చెప్పినట్లు ఎక్కడైతే అధికారం పోగొట్టుకున్నామో, అక్కడే వెతుక్కోవాలని, ఈరోజు సర్పంచ్ ఎన్నికల ఫలితాలు ఆ ఉత్సాహాన్ని ఇస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. రెండేళ్ల కిందట అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిపాటి ఓట్ల తేడాతో నిరాశ ఎదురైనా, నేడు భువనగిరిలో 56 మంది, ఆలేరులో 74 మంది, మునుగోడులో 15 మంది, తుంగతుర్తిలో 9 మంది, నకిరేకల్‌లో 7 మంది.. ఇలా జిల్లా వ్యాప్తంగా మొత్తం 161 మంది సర్పంచులను గెలిపించుకోవడం సామాన్య విషయం కాదని ఆయన కొనియాడారు. ఈ విజయం రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులకు వెయ్యి ఏనుగుల బలాన్ని ఇచ్చిందని, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సులతో గులాబీ జెండా మళ్లీ రెపరెపలాడుతుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయం అత్యంత గలీజుగా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. మిగితా 3వ పేజీలో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో సిట్

- సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో ఐదుగురు ఐపీఎస్‌లు



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ ఐజీ ప్రభాకర్‌రావు కస్టోడియల్ విచారణ గడువు గురువారంతో ముగిసింది. గత ఏడ్రోజులుగా జూబ్లీహిల్స్‌లోని ఏసీపీ కార్యాలయంలో ప్రభాకర్‌రావును సిట్ అధికారులు విచారించారు. ఏసీపీ వెంకటగిరి నేతృత్వంలో సాగిన ఈ విచారణలో ప్రభాకర్‌రావు నుంచి సాధ్యమైనంత వరకు ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో నిజాలను బయటకు లాగడానికి దర్యాప్తు అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. ఏసీపీ కార్యాలయంలోనే ఏర్పాటు చేసిన ప్రత్యేక గదిలో నిందితుడికి బస ఏర్పాటు చేసి మరీ విచారించారు. ఈ ఏడ్రోజులు భోజనంతో పాటు ఆయన ఆరోగ్యానికి అవసరమైన ఔషధాలను సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇంటి నుంచే తెప్పించారు. విచారణ సమయంలో నిందితుడి తరఫు న్యాయవాది కూడా ఆయన సమక్షంలోనే ఉన్నారు. మొత్తమ్మీద తన ఆదేశాల మేరకో లేదా తన పైసీనియర్ అధికారుల ఆదేశాల మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫోన్‌ట్యాపింగ్ జరిగిన మాట నిజమేనని ప్రభాకర్‌రావు అంగీకరించినట్టు దర్యాప్తు వర్గాల నుంచి తెలిసింది.

## బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ యత్నం

- గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత
- పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు అదుపులోకి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్‌లోని గాంధీ భవన్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు యత్నించాయి. అయితే పోలీసులు గాంధీ భవన్ గేట్లను మూసివేయడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. పోలీసులు అడ్డుకోవడంతో గాంధీ భవన్ గేటు ముందు కాంగ్రెస్ నేతలు బైఠాయించి నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో భారీగా పోలీసు బలగాలు మోహరించాయి. పలువురు నిరసనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాంగ్రెస్ శ్రేణుల ఆందోళనతో గాంధీ భవన్ పరిసరాల్లో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ ర్యాలీలో మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు సీనియర్ నేతలు, మహిళా నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**నేషనల్ హెరాల్డ్ కేసులో రాజకీయ కక్ష**

ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై రాజకీయ కక్షతోనే చర్యలు తీసుకుంటున్నారని ఆరోపించారు. "సోనియా గాంధీ వయస్సును కూడా చూడకుండా ఇబ్బందులు పెడుతున్నారు. ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన తీర్పు మోదీకి చెంపపెట్టు లాంటిది. ఇప్పటికైనా ప్రధాని తప్పు తెలుసుకుని గాంధీ కుటుంబానికి, దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలి. శాంతియుతంగా బీజేపీ కార్యాలయం ముందు ధర్నా చేయాలన్నదే మా ఉద్దేశం" అని అన్నారు.

రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ, ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని, నేషనల్ హెరాల్డ్ కేసులో కూడా అదే జరిగిందని చెప్పారు. బీజేపీ పెట్టిన అక్రమ కేసులపై ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తామని, గాంధీ కుటుంబంపై కక్షసాధింపు చర్యలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. న్యాయం గెలవడానికి సమయం పట్టినా చివరికి విజయం సాధించేది న్యాయమేనని ఆమె వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ శ్రేణుల ర్యాలీ నేపథ్యంలో బీజేపీ కార్యాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ముందస్తుగా అప్రమత్తమై కార్యాలయానికి వెళ్లే మార్గాల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు వస్తున్నారన్న సమాచారంతో బీజేపీ కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత తలెత్తకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకుని పలువురిని అదుపులోకి తీసుకున్నారు.



## టారిఫ్‌లతోనే అమెరికా ఆర్థిక వికాసం వేగం

- 18 ట్రిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి
- 10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా
- అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**బలగం టీవి, వాషింగ్టన్**

ప్రపంచ దేశాలపై దిగుమతి సుంకాలు (టారిఫ్‌లు) పెంచడమే అమెరికా ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడానికి కారణమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. తమ ప్రభుత్వ విధానాల వల్ల మునుపెన్నడూ లేని స్థాయిలో అమెరికా ఆర్థిక పురోగతి నమోదు అవుతోందన్నారు. దేశంలో నిత్యావసరాల ధరలను గణనీయంగా తగ్గించామని పేర్కొన్న ట్రంప్, అందుకే తనకు అత్యంత ఇష్టమైన పదం 'టారిఫ్స్' అని వ్యాఖ్యానించారు. 2025 సంవత్సరాంతం సందర్భంగా వాషింగ్టన్‌లోని వైట్‌హౌస్ నుంచి అమెరికా ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ట్రంప్, టారిఫ్‌ల ప్రభావంతో అమెరికాలోకి కొత్తగా 18 ట్రిలియన్ డాలర్ల విలువైన పెట్టుబడులు వచ్చాయని వెల్లడించారు.

ఇతర దేశాలు దశాబ్దాలుగా 'టారిఫ్' అనే పదాన్ని అమెరికాకు వ్యతిరేకంగా విజయవంతంగా ఉపయోగించాయని ట్రంప్ విమర్శించారు. ఇకపై అలాంటి అవకాశాన్ని ఇవ్వబోమని స్పష్టం చేశారు. టారిఫ్‌ల ప్రభావంతో వచ్చిన భారీ పెట్టుబడులు కొత్త ఉద్యోగాల సృష్టికి దోహదపడతాయని, ఉద్యోగుల వేతనాలు పెరుగుతాయని, దేశవ్యాప్తంగా కొత్త ఫ్యాక్టరీలు, యూనిట్లు ఏర్పడతాయని చెప్పారు. అమెరికాలోనే ఉత్పత్తులు తయారు చేస్తే టారిఫ్‌లు ఉండవని కంపెనీలకు తెలుసని, అందుకే పెద్ద సంఖ్యలో సంస్థలు అమెరికాలో పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్నాయని ట్రంప్ తెలిపారు. ఈ పరిణామాలు అమెరికా జాతీయ భద్రతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు.

**"10 నెలల్లో 8 యుద్ధాలు ఆపా"**

గత 10 నెలల్లో తాను 8 యుద్ధాలను ఆపినట్లు ట్రంప్ మరోసారి చాటింపు వేసుకున్నారు. ఇరాన్ నుంచి ప్రపంచానికి అణ్వాయుధ ముప్పు లేకుండా చేసిన ఘనత తనకేనని అన్నారు. అలాగే ఇజ్రాయెల్%–%గాజా యుద్ధాన్ని ఆపి పశ్చిమాసియాలో శాంతి వాతావరణం నెలకొల్పినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్, గాజాలోని బందీలు, ఖైదీలు, మృతదేహాల విడుదలకు కూడా తానే కారణమని ట్రంప్ తెలిపారు.

# ఏపీలో విజృంభిస్తున్న స్క్రబ్ టైఫస్

- మరణాలు 15కు చేరిక..
- 1,806 పాజిటివ్ కేసులు నమోదు

**బలగం టీవీ, అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్క్రబ్ టైఫస్ వ్యాధి తీవ్రత ఆందోళనకర స్థాయికి చేరింది. ఇప్పటివరకు స్క్రబ్ టైఫస్ కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 15 మంది మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. స్క్రబ్ టైఫస్‌తో పాటు ఇతర దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిలో మరణాల సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 9,236 మందికి పరీక్షలు నిర్వహించగా, 1,806 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. స్క్రబ్ టైఫస్ వ్యాధి నియంత్రణపై అధికార యంత్రాంగం తగినంత దృష్టి సారించడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



పశువులు నివసించే ప్రాంతాల్లో ఉండే 'చిగ్గర్ మైట్' అనే సూక్ష్మకీటకం మనుషులను కుట్టడం ద్వారా స్క్రబ్ టైఫస్ సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. కీటకం కుట్టిన చోట నల్లటి మచ్చ ఏర్పడటంతో పాటు జ్వరం, తలనొప్పి వంటి లక్షణాలు మలేరియాను పోలి ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ వ్యాధి కేసులు పెరిగే అవకాశముందని హెచ్చరిస్తున్నారు. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 444 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కాకినాడ జిల్లాలో 183, విశాఖపట్నం 143, వైఎస్సార్ కడప 118, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు 113, విజయనగరం 96, తిరుపతి జిల్లా 90, గుంటూరు జిల్లా 85, అనంతపురం జిల్లాలో 83 కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అనుమానిత మరణాల పరంగా పల్నాడు జిల్లాలో మూడు, విజయనగరం జిల్లాలో రెండు, బాపట్ల జిల్లాలో రెండు, కృష్ణా జిల్లాలో రెండు, ప్రకాశం జిల్లాలో రెండు మరణాలు సంభవించాయి. అలాగే శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అన్నమయ్య, ఎన్టీఆర్, కాకినాడ జిల్లాల్లో ఒక్కో మరణం నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాలల వేళల్లో మార్పు

- చలి తీవ్రత నేపథ్యంలో కలెక్టర్ ఉత్తర్వులు

**బలగం టీవీ, ఆదిలాబాద్**

ఆదిలాబాద్ జిల్లాలో కొనసాగుతున్న చలి తీవ్రత దృష్ట్యా పాఠశాలల పనివేళల్లో మార్పులు చేస్తూ జిల్లా కలెక్టర్ రాజర్షి షా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను ప్రధానంగా పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉదయం 9.00 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పాఠశాల సమయాలను సవరించి, ఇకపై ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొనసాగించాలని ఆదేశించారు. ఈ మార్పులు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ, హై స్కూళ్లకు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

ప్రభుత్వ, ఎల్బీ, కేజీబీవీ, మోడల్ హై స్కూళ్లు అలాగే ప్రైవేటు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు ఈ ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించని పక్షంలో సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని, పాఠశాలల సమయాల మార్పుల అమలును విద్యాశాఖ పర్యవేక్షిస్తుందని కలెక్టర్ తెలిపారు.

# తెలంగాణలో ఎన్నికల కోడ్ ఎత్తివేత

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలో గ్రామ పంచాయతీల ఎన్నికల నేపథ్యంలో అమలు చేసిన ఎన్నికల కోడ్‌ను ఎత్తివేస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 5 గంటల నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉండదని స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా ముగిసినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల విధుల్లో పాల్గొంటూ మరణించిన సిబ్బందికి పరిహారం చెల్లించాల్సి ఉందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇందుకు సంబంధించిన చర్యలను జిల్లాల కలెక్టర్లు వెంటనే చేపట్టాలని సూచించింది. ఇదిలా ఉండగా, నూతనంగా ఎన్నికైన సర్పంచులు ఈ నెల 22న పదవీ స్వీకరణ చేయాలని పంచాయతీ రాజ్ శాఖ ఆదేశాలు జారీ చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ముందు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో ఉప ఎన్నికల నేపథ్యంలో విధించిన ఎన్నికల కోడ్‌ను నవంబర్ 16న కేంద్ర ఎన్నికల సంఘం ఎత్తివేసింది. అనంతరం తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ సందర్భంగా మళ్లీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తాజాగా ఎన్నికలు పూర్తికావడంతో రాష్ట్రంలో అమలులో ఉన్న మోడల్ కోడ్‌ను ఎత్తివేస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. దీంతో ప్రభుత్వ పరిపాలనా కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరనున్నాయి.

# జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరింత షాక్




- ప్రజాధనాన్ని ఫుట్‌బాల్ షోలు, ఇతర కార్యక్రమాలకు దుర్వినియోగం చేస్తున్నారు
- మాజీ మంత్రి టి.హరీష్ రావు

**బలగం టీవీ, మెదక్**

తెలంగాణ పల్లె ప్రజలు రేవంత్ రెడ్డికి దిమ్మతిరిగే తీర్పు ఇచ్చారని అన్నారు. సింబల్ లేని సర్పంచ్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు పరాభవం ఎదురైందని, రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మరింత గట్టి షాక్ తగులుతుందని మాజీ మంత్రి టి.హరీష్ రావు అన్నారు. మెదక్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన నూతన సర్పంచుల సన్మాన కార్యక్రమంలో మాజీ మంత్రి టి.హరీష్ రావు పాల్గొని, గెలిచిన సర్పంచులను సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

గెలిచిన సర్పంచులందరికీ శిరస్సు వంచి అభినందనలు తెలియజేస్తున్నానని, ఇది సాధారణ విజయం కాదని హరీష్ రావు పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలోనైనా అధికార పార్టీకి 80 నుంచి 90 శాతం సర్పంచ్ స్థానాలు దక్కుతాయని, కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ బీఆర్ఎస్ పార్టీ 40 శాతం సర్పంచ్ స్థానాలు గెలుచుకుందని అన్నారు. ఇది ప్రజల తీర్పుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ జిల్లా జిల్లాలుగా తిరిగినప్పటికీ ప్రజలు కాంగ్రెస్‌ను బండకేసి కొట్టారన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించిన హరీష్ రావు, 42 శాతం బీసీ రిజర్వేషన్, రైతుబంధు, రుణమాఫీ, యూరియా సరఫరా, సన్నవడ్ల బోనస్ వంటి అంశాల్లో ప్రజలను మోసం చేసిందన్నారు. దళిత బంధు, కేసీఆర్ కిట్, గొర్రెల పంపిణీ వంటి పథకాలు నిలిచిపోయాయని విమర్శించారు. మహిళలకు ఫ్రీ బస్ పేరుతో పురుషులపై భారం మోపుతున్నారని ఆరోపించారు.

కేసీఆర్ పాలనలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేవని, నేడు మళ్లీ పాత కాంగ్రెస్ రోజులు తిరిగి వచ్చాయని హరీష్ రావు అన్నారు. ప్రజలు మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చూడాలని కోరుకుంటున్నారని తెలిపారు. రెండేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. గెలుపు బాధ్యతను పెంచుతుందని, సర్పంచులు గ్రామాల్లో ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని సూచించారు. సర్పంచుల అధికారాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని, ఓడిన వారు నిరాశ చెందవద్దని, గెలిచిన వారు బాధ్యతగా పని చేసి మళ్లీ గెలవాలని హితవు పలికారు.

ప్రజాధనాన్ని ఫుట్‌బాల్ షోలు, ఇతర కార్యక్రమాలకు దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెదక్ జిల్లా అభివృద్ధిపై ప్రశ్నలు లేవనెత్తిన హరీష్ రావు, రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సర్పంచులను, వార్డు సభ్యులను ఎవరైనా ఇబ్బంది పెడితే నేరుగా తనకు సమాచారం ఇవ్వాలని, బీఆర్ఎస్ పార్టీ వారి అండగా నిలుస్తుందని హరీష్ రావు స్పష్టం చేశారు. అధికారులు న్యాయంగా, ధర్మంగా పనిచేయాలని, ఏకపక్షంగా వ్యవహరిస్తే భవిష్యత్తులో బాధ్యత తప్పదని హెచ్చరించారు.

# నాంపల్లి కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు


**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపు రావడంతో కలకలం రేగింది. ఆగంతకులు ఫోన్ కాల్ ద్వారా రెండు బాంబులు పేలుతాయని బెదిరించడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది వెంటనే రంగప్రవేశం చేసి కోర్టు ప్రాంగణంలో ఉన్న వారిని బయటకు పంపించి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల నగరంలోని హైదరాబాద్ హైకోర్టు, నాంపల్లి కోర్టు, జింఖానా క్లబ్, హైదరాబాద్, సికింద్రాబాద్ సిటీ సివిల్ కోర్టులు, ప్రజా భవనాలకు వరుసగా బాంబు బెదిరింపులు వచ్చిన సంగతి తెలిసిందే. అయితే అవన్నీ ఉత్తుత్తి బెదిరింపులేనని తేలినా, ముందస్తు జాగ్రత్త చర్యలలో భాగంగా పోలీసులు తప్పనిసరిగా తనిఖీలు నిర్వహించాల్సి వచ్చింది. బాంబు బెదిరింపులపై అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోందని, ప్రజలు ఆందోళనకు గురికావద్దని పోలీసులు సూచించారు. భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు.

# లక్నో టీ20 రద్దుకు కారణం పొగమంచు కాదు

- గ్రాలి కాలుష్యమే అసలు కారణం
- స్రమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్

**బలగం టీవీ, లక్నో**



భారత్–సౌతాఫ్రికా మధ్య జరగాల్సిన నాలుగో టీ20 మ్యాచ్ రద్దుకు పొగమంచు కారణం కాదని, గాలి కాలుష్యమే అసలు కారణమని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ పేర్కొన్నారు. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం లక్నో వేదికగా జరగాల్సిన మ్యాచ్ టాస్ సమయానికే మైదానాన్ని పొగమంచు కమ్మేయడంతో రద్దైన సంగతి తెలిసిందే. పలుమార్లు మైదానాన్ని పరిశీలించి విజిబిలిటీ పరీక్షించిన అంపైర్లు చివరకు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఘటనపై స్పందించిన అఖిలేష్ యాదవ్, సోషల్ మీడియా వేదికగా బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఢిల్లీ కాలుష్యం లక్నోకు చేరుకోవడం వల్లే అంతర్జాతీయ మ్యాచ్ రద్దయ్యిందని అన్నారు. "ఈ మ్యాచ్ రద్దుకు మంచు కారణం కాదు.. విషపూరితమైన గాలి కాలుష్యమే కారణం. లక్నోలో స్వచ్ఛమైన గాలి కోసం ఏర్పాటు చేసిన పార్కులను కూడా బీజేపీ ప్రభుత్వం నాశనం చేసింది. పర్యావరణ పరిరక్షణ విషయంలో బీజేపీకి చిత్తశుద్ధి లేదు. లక్నోలో ఉన్నవారు మాస్క్ ధరించాలి" అని ట్వీట్ చేశారు.

పొగమంచుతో పాటు గాలి నాణ్యత తీవ్రంగా పడిపోవడంతో టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా మాస్క్ ధరించి కనిపించారు. కొద్దిసేపు ప్రాక్టీస్ చేసిన భారత ఆటగాళ్లు అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితమయ్యారు. రాత్రి 9.30 గంటలకు చివరిసారిగా మైదానాన్ని పరిశీలించిన అంపైర్లు మ్యాచ్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మ్యాచ్ రద్దుపై అభిమానులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐపై విమర్శలు గుప్పిస్తూ, పొగమంచు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మ్యాచ్‌లు ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. దక్షిణ భారతదేశంలో అనుకూల వాతావరణం ఉన్న మైదానాలు ఉన్నాయని, తమ టికెట్ డబ్బులు తిరిగి చెల్లించాలని ప్రేక్షకులు డిమాండ్ చేస్తున్నారు.

# ఏసీబీ వలలో కారేపల్లి ఆర్ఐ

**బలగం టీవీ, ఖమ్మం**



ఖమ్మం జిల్లా కారేపల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ దౌలూరి శుభకామేశ్వరి దేవి ఏసీబీ వలలో చిక్కారు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ జారీ చేయడానికి కారేపల్లి మండలానికి చెందిన ఓ వ్యక్తి నుంచి రూ.10,000 లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయినట్లు అధికారులు తెలిపారు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ ఆధ్వర్యంలో ముందస్తు సమాచారంతో కారేపల్లిలోని ఆర్ఐ నివాసం వద్ద వలవేసి దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న సమయంలోనే ఆమెను పట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. మరిన్ని అంశాలు వెలుగులోకి రావాల్సి ఉందని పేర్కొన్నారు.

# అమెరికాలో భారత సంతతికి చెందిన క్యాబ్ డ్రైవర్ దారుణం

**బలగం టీవీ, కాలిఫోర్నియా**

అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ క్యాబ్ డ్రైవర్ అమానుషానికి పాల్పడ్డాడు. మద్యం మత్తులో స్పృహ కోల్పోయిన ఓ యువతిపై లైంగిక దాడి చేశాడన్న ఆరోపణలతో పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. కాలిఫోర్నియాలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంచురా కౌంటీ షెరీఫ్ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం, బేకర్స్‌ఫీల్డ్‌కు చెందిన సిమ్రన్‌జిత్ సింగ్ సెఖోన్ (35) క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 27న తెల్లవారుజామున 1 గంట సమయంలో 21 ఏళ్ల యువతి థౌజండ్ ఓక్స్‌లోని ఓ బార్ నుంచి కమరిల్లోలో ఉన్న తన నివాసానికి వెళ్లేందుకు క్యాబ్ బుక్ చేసుకుంది. అప్పటికే ఆమె తీవ్ర మత్తులో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మార్గమధ్యంలో యువతి నిద్రలోకి జారుకున్నప్పటికీ, ఆమెను గమ్యస్థానానికి చేర్చాల్సిన సెఖోన్ ట్రిప్ పూర్తయినట్లు యాప్‌లో చూపించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం స్పృహలో లేని ఆమెను కమరిల్లో వీధుల్లో కారులో తిప్పుతూ లైంగిక దాడికి పాల్పడ్డాడని దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై నవంబర్‌లోనే కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తు అనంతరం ఈ నెల 15న నిందితుడిని అరెస్ట్ చేశారు. అనంతరం అతడిని కోర్టులో హాజరుపరచగా, తాను నేరం చేయలేదని వాదించినట్లు సమాచారం.



# ఆరోగ్య శిబిరం

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం రోజున బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సందర్శించి, పిల్లలకు వైద్య పరీక్షలు చేసి,అవసరమైన మందులను పంపిణీ చేశారు. వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ.. పిల్లలకు నోటి పరిశుభ్రత, హ్యాండ్ వాష్ టెక్నిక్, చలికాలంలో వచ్చే నిమోనియా, అస్తమా,ఎలర్జీకి సంబంధించిన వ్యాధులపై పిల్లలకు అవగాహన కల్పించామని, అనంతరం స్కూల్ హాస్టల్ ను సందర్శించి పిల్లలకు పరిశుభ్రమైన పోషకాహారాన్ని, వేడి వేడిగా ఎప్పటికప్పుడు అందించాలని వార్డెన్ కి సూచనలు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ టి. హేమలత, ఎస్.ఓ లింగవ్వ, సబ్ సెంటర్ ఆరోగ్య కార్యకర్త ఉషాదేవి, స్కూల్ ఆరోగ్య కార్యకర్త ప్రసన్న, ఆశా కార్యకర్త లత, తదితరులు పాల్గొన్నారు.



## నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులను సన్మానించిన మాల ఐక్యవేదిక జిల్లా నాయకులు

**బలగం టీవీ, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో నూతనంగా ఎన్నికైన ఉప సర్పంచ్ పండుగ శంకర్, రెండవ వార్డు సభ్యుడిగా ఎన్నికైన పండుగ పర్శరాములను అభినందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని. గ్రామంలో ఉన్న సమస్యల పరిష్కారానికి తమ వంతు బాధ్యతగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటామని. మాల ఐక్యవేదిక జిల్లా నాయకుల ఆధ్వర్యంలో నూతన ప్రజాప్రతినిధులను సన్మానించడం చాలా సంతోషదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు నీరటి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మూలే కిషోర్, మాలల ఐక్యవేదిక కన్వీనర్ తుంగ శివరాజ్, కో–కన్వీనర్ జక్కుల యాదగిరి, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు వంకాల మహేశ్వర్, ఉపాధ్యక్షుడు పండుగ నిరంజన్, మాజీ ఎంపీటీసీ పండుగ ప్రమీల, వీరేందర్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పండుగ సుమన్, మాజీ అధ్యక్షుడు పండుగ నర్సింహా స్వామి, అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ సభ్యుడు పండుగ అంజయ్య, అంబేద్కర్ ఆదర్శ సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## భవిష్యత్తు గెలుపునకు భువనగిరి నుంచే పునాది

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి నల్గొండ జిల్లాలో బీఆర్ఎస్ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఆయన తీవ్రంగా ఖండించారు. నూతన్‌కల్ మండలంలో మల్లయ్య యాదవ్‌ను కిరాతకంగా చంపడం, నల్గొండలో అభ్యర్థిపై దాడి చేసి అమానవీయంగా మూత్రం తాగించి అవమానించడం వంటి ఘటనలు కాంగ్రెస్ నాయకుల వికృత మనస్తత్వానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ ఎప్పుడూ ఇలాంటి చిల్లర రాజకీయాలకు తావివ్వలేదని గుర్తు చేశారు. అధికారులు కూడా అధికార పక్షానికి కొమ్ముకాస్తూ, గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థులను దొంగతనంగా ఓడించే ప్రయత్నం చేస్తున్నారని, 150కి పైగా గ్రామాల్లో జరుగుతున్న ఈ అన్యాయంపై కోర్టుల ద్వారా న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై కేటీఆర్ నిప్పులు చెరిగారు. అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లోకి వెళ్లామని సిగ్గు లేకుండా మైకుల్లో చెబుతున్న కడియం శ్రీహరి వంటి నాయకులు, అసెంబ్లీలో ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని హీనస్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. 70 ఏళ్ల వయసులో సంపాదించుకున్న గౌరవాన్ని రేవంత్ రెడ్డి సంకలో చేరి నాశనం చేసుకున్నారని, గబ్బిలాలు సూరు పట్టుకుని వేలాడినట్లు వీరి పరిస్థితి తయారైందని ఘాటుగా విమర్శించారు. స్పీకర్ కూడా ముఖ్యమంత్రి చెప్పినట్లు ఆడుతూ, ఫిరాయింపులు కనపడనట్లు నటిస్తున్నారని దుయ్యబట్టారు.రేవంత్ రెడ్డి మూడు ఫీట్లు ఉన్నా ముప్పై ఫీట్ల డైలాగులు కొడతారని, కానీ క్షేత్రస్థాయిలో ప్రజలు మోసపోయామని గ్రహిస్తున్నారని కేటీఆర్ అన్నారు. తులం బంగారం ఇస్తామని, పింఛన్లు పెంచుతామని లంగ మాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు రైతుబంధు రాక రైతులు అల్లాడుతున్నారని పేర్కొన్నారు. తినే పళ్లెంలో మన్ను పోసుకున్నామని, పాలిచ్చే బర్రెను వదిలి తన్నే దున్నపోతును తెచ్చుకున్నామని ప్రజలు బాధపడుతున్నారని వ్యాఖ్యానించారు.

వచ్చే జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని, భువనగిరి కోటపై గులాబీ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు. సర్పంచులు, ఎంపీటీసీలు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ బీ-ఫామ్ మీద జరిగే ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు తిరుగులేని విజయం అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఎవరి అత్త సొమ్ము కాదని, అవి రాజ్యాంగబద్ధంగా ప్రజలకు అందాల్సిన హక్కులని, ఏ ఎమ్మెల్యే వాటిని ఆపలేడని భరోసా ఇచ్చారు. గత పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ, ముఖ్యంగా ఉమ్మడి నల్గొండ జిల్లా సాధించిన అభివృద్ధిని కేటీఆర్ వివరించారు.

# ఫెర్టిలైజర్ యాప్‌పై రైతులకు వివరించాలి

- **ఆయిల్ పామ్ పై అవగాహన కల్పించాలి**
- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ఫెర్టిలైజర్ యాప్ పై అవగాహన, ఆయిల్ పామ్ సాగుపై ఫెర్టిలైజర్ షాప్, ఐకేపీ ఫెర్టిలైజర్ డీలర్లు, వ్యవసాయ అధికారులకు కార్యక్రమం**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రైతులకు ఎరువుల సరఫరా విషయంలో ఇబ్బందులు దూరం చేసేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ పై వివరించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు ఇచ్చారు.ఫెర్టిలైజర్ యాప్ పై అవగాహన, ఆయిల్ పామ్ సాగు విస్తీర? లక్ష్యాల సాధనపై సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట రైతు వేదికలో ఫెర్టిలైజర్ షాప్, ఐకేపీ ఫెర్టిలైజర్ డీలర్లు, వ్యవసాయ అధికారులు, పీఏసీఎస్ కార్యదర్శులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఫెర్టిలైజర్ యాప్ తో ఉపయోగాలను రైతులకు వివరించాలని పేర్కొన్నారు. యాప్ వినియోగంతో రైతులకు ఎరువుల వివరాలు, ఎక్కడ అందుబాటులో ఉందో అనే సమాచారం తెలుస్తుందని, వారికి కేటాయించిన ఎరువులు అందుబాటులో ఉంటాయనే వివరాలు తెలుపాలని సూచించారు. ఎక్కడి నుంచి అయినా రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం వివరాలతో లాగిన్ అయితే వారికి పూర్తి సమాచారం అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. షాపుల యజమానులు యాప్ పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఒకరిని నియమించాలని, వారు రైతులకు యాప్ లో బుకింగ్ పై సహాయం చేయాలని సూచించారు.

ఆయిల్ పామ్ సాగు విస్తీరణ పెరగడం వల్ల రైతులకు అధిక లాభం జరగడంతో పాటు దేశానికి కూడా ఎంతో మేలు చేకూరుతుందని తెలిపారు. ఆయిల్ పామ్ సాగుకు ఆసక్తిగా ఉన్న రైతుల వివరాలు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, ఏవో, ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

# ధర్నా ఎందుకు చేస్తున్నారో వారికే తెలియదు..!

- **బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని బీజేపీ కార్యాలయం సమీపంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మీడియాతో మాట్లాడుతూ.. "ఈరోజు కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ జిల్లా పార్టీ కార్యాలయాల ముందు ధర్నా చేయాలని పిలుపునిచ్చిందట, అది ఎందుకో కాంగ్రెస్ పార్టీ వాళ్ళకే తెలియదు. ఈరోజు నేషనల్ హెరాల్డ్ కేసు ఏదైతే ఉందో అది వేసిన వ్యక్తి సుబ్రహ్మణ్యస్వామి దానికి బిజెపి పార్టీకి ఏమైనా సంబంధం ఉందా? లేదు. సుప్రీంకోర్టు ధర్మాసనం ఏం ఆర్డర్ ఇచ్చిందంటే ఒక్క ప్రైవేటు వ్యక్తి కేసు వేసిండో అందులో సుప్రీంకోర్టు ఏం ఆర్డర్ ఇచ్చింది. ప్రభుత్వ సంస్థల ద్వారా విచారణ చేయమని ఆర్డర్ ఇస్తే ప్రభుత్వ సంస్థలైన ఈడి దానికి సంబంధించిన సంస్థలు విచారణ ప్రారంభించాయి. అందులో భాగంగా ఆ విచారణలో ఉన్న వ్యక్తికి విచారణకు రావాలని నోటీస్ జారీ చేశాయి. ఆ నోటి జారీ చేసిన విధానం ఏంది అయితే ఉన్నదో.. ఎఫ్ఐఆర్ కాకుండా ఆ నోటీస్ జారీ చేయగా.. ఎఫైర్ చేసి జారీ చేయాలని నోటీసు ఇవ్వాలని కోర్టు పేర్కొంది. దానికి ధర్నాలు ఎందుకో నాకు అర్థం కాలే. ఆ కేసులో నిర్దోసులుగా కేసు గెలిస్తే సంబరాలు చేసుకోవాలి కానీ.. ఈ ధర్నాలు ఎందుకు అర్థం కాలేదు అంటూ మండిపడ్డారు. అధికార దుర్వినియోగ్యానికి పాల్పడుతుందని కాంగ్రెస్ పార్టీ తీరును తప్పుపట్టారు.




కాంగ్రెస్ పార్టీ నాయకులు ధర్నా చేస్తే బిజెపి నాయకులను పార్టీ కార్యాలయంలో బంధించడం ఎంతవరకు సమంజసం అంటూ ప్రశ్నించారు అరెస్టు చేయడం సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు పొన్నాల తిరుపతిరెడ్డి, సిరికొండ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, కొనరావుపేట మండలం మిరాల్కర్ బాలాజీ (ధర్మారం గ్రామ సర్పంచ్), వేములవాడ పట్టణ అధ్యక్షులు రాపల్లి శ్రీధర్, చందుర్తి మండల అధ్యక్షులు మోకిలే విజయేందర్, సిరిసిల్ల పట్టణ మహిళా అధ్యక్షురాలు వైశాలి, జిల్లా మరియు రాష్ట్ర పదాధికారులు, అధికారులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించినందుకు కృతజ్ఞతలు

(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేశారు. ప్రజలు ప్రతిపక్షంలో కూర్చోబెట్టినా కొందరికి ఇంకా అహంకారం తగ్గలేదనీ, కడుపులో మూసీలో కాలుష్యం కంటే ఎక్కువ విషం పెట్టుకొని మాట్లాడుతున్నారని చెప్పారు. ప్రజలకు మంచి జరుగుతుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు.

ప్రజా ప్రభుత్వం రెండేళ్ల పరిపాలన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలతో ప్రజల ముందుకు వెళ్లగా, తమకు 7,527 గ్రామ పంచాయతీల్లో (66 శాతం) ప్రజలు అందించిన ఆశీర్వాదం.. ప్రభుత్వంపై మరింత బాధ్యత పెంచిందని చెప్పారు. ప్రజల ఆశీర్వాదంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివ ృద్ధి రెండిండినీ సమపాళ్లలో ముందుకు తీసుకెళుతున్నామని అన్నారు. "రాష్ట్రంలో కొత్తగా రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, రైతు భరోసా, సన్నధాన్యానికి బోనస్ చెల్లింపు, ఉచిత కరెంట్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్, రూ. 500 లకే సిలిండర్, 27 వేల కోట్ల రూపాయల మేరకు సున్నా వడ్డీకే మహిళా సమాఖ్యలకు రుణాలు, 4.5 లక్షల మంది నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, అధికారం చేపట్టిన తొలి ఏడాదిలోనే 61 వేల ఉద్యోగాల భర్తీ, సుదీరికాలం అపరిష్కృతంగా ఉన్న ఎస్సీ వర్గీకరణ సమస్యకు పరిష్కారం, వందేళ్లుగా జరగని బీసీ కులగణన చేపట్టడం, పేదలకు మంచి విద్యను అందించాలన్న ప్రయత్నాలు... ఇలా అనేక అంశాల్లో ప్రభుత్వం ఒక క్రమపద్ధతిలో అభివ ృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది" అని ముఖ్యమంత్రి వివరించారు.ఒకవైపు ఆదాయాన్ని పెంచుకుంటూ దుబారాను తగ్గిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరక్కుండా ప్రజలకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ తాపత్రయమని ఒక ప్రశ్నకు సమాధానంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు.కృష్ణా గోదావరి జలాలపై తెలంగాణ హక్కులకు సంబంధించి పూర్తి వివరాలతో శాసనసభలో చర్చించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఫెయిల్యూర్ అయ్యారని హరీశ్‌రావు టీం నాయకత్వ మార్పును డిమాండ్ చేస్తూ సోషల్ మీడియాలో క్యాంపెయిన్ నిర్వహిస్తున్నదనీ, కేటీఆర్‌కు కాంగ్రెస్ కంటే కూడా ఇప్పుడు హరీశ్‌రావు భయమే పట్టుకుందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ క్రియాశీల రాజకీయాల్లో లేరనీ, ఈ విషయాన్ని గజ్వేల్ ప్రజలు గుర్తించి, అక్కడ మెజారిటీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల్ని గెలిపించారని తెలిపారు. కృష్ణా, గోదావరి నదీజలాలపై చర్చ కోసం ప్రతిపక్షనేత హోదాలో కేసీఆర్ స్పీకర్‌కు లేఖ రాస్తే, ఆయన కోరుకున్న తేదీల్లోనే అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని విలేకరులు అడిగిన ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో కంటే పదేండ్ల బీఆర్ఎస్, కేసీఆర్ హయాంలోనే తెలంగాణ ప్రజలకు తీరని ద్రోహం జరిగిందని అభిప్రాయపడ్డారు. దీన్ని ఆధారాలతో సహా అసెంబ్లీలో నిరూపిస్తామన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలపై 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రజాస్వామ్య బద్ధంగా అసెంబ్లీలో చర్చించి ముందుకు వెళతామన్నారు. ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు.

# రోల్‌బాల్ వరల్డ్‌కప్‌లో భారత జట్లు విజయం





- **దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్లో కెన్యాపై పురుషుల జట్టు 11-10, మహిళల జట్టు 3-2తో విజయం**

**బలగం టీవీ, హైదరాబాద్**

రోల్‌బాల్ వరల్డ్‌కప్‌లో భారత పురుషుల, మహిళల జట్లు విజేతలుగా నిలిచి దేశానికి ఘనత తీసుకొచ్చాయి. దుబాయ్ వేదికగా జరిగిన ఫైనల్ పోరులో భారత పురుషుల జట్టు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో 11–10 తేడాతో కెన్యాను ఓడించింది. మహిళల విభాగంలోనూ భారత్ 3–2తో కెన్యాపై గెలిచి ప్రపంచకప్ కిరీటాన్ని ముద్దాడింది. ఆసాంతం ఉత్కంఠగా సాగిన పురుషుల ఫైనల్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కెన్యా గట్టి పోటీ ఇచ్చింది. ఒక దశలో భారత్ వెనుకంజలో ఉన్నప్పటికీ పుంజుకుని విజయం సాధించింది. ఈ గెలుపుతో భారత పురుషుల జట్టు ఐదో ప్రపంచకప్ టైటిల్‌ను సొంతం చేసుకోగా, మహిళల జట్టు మూడోసారి ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది.

ఈ మెగా ఈవెంట్‌లో భారత్‌తో పాటు కెన్యా, పోలాండ్, అర్జెంటీనా, సౌదీ అరేబియా, పాకిస్థాన్ వంటి దేశాల జట్లు పాల్గొన్నాయి. 2023లో పుణెలో జరిగిన ప్రపంచకప్‌లో కెన్యా చేతిలో ఎదురైన పరాజయానికి ఈసారి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. దుబాయ్ గడ్డపై రెండు విభాగాల్లోనూ క్లీన్‌స్వీప్ చేసి ప్రపంచ స్థాయిలో భారత ఆధిపత్యాన్ని చాటింది.భారత పురుషుల జట్టు విజయంలో రోహన్ దాభాడే, హితేష్ సింగ్, యష్ రాశియా, హర్షల్ ఘుగే కీలక పాత్ర పోషించారు.

**రోల్‌బాల్ ఎలా ఆడుతారు?**

భారత్‌లో పుట్టిన వినూత్న క్రీడ రోల్‌బాల్. బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, రోలర్ స్కేటింగ్‌ల మేళవింపుగా ఈ ఆట సాగుతుంది. ఆటగాళ్లు రోలర్ స్కేట్స్ ధరించి బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌లోకి పంపాలి. ప్రతి జట్టులో 12 మంది ఆటగాళ్లు ఉన్నా, మైదానంలో ఒకేసారి ఆరుగురు మాత్రమే ఆడతారు. ఒక గోల్‌కీపర్ ఉంటాడు. బంతిని ఒక చేత్తో లేదా రెండు చేతులతో పాస్ చేయవచ్చు. గోల్ వేసేటప్పుడు మాత్రం ఒక చేయి మాత్రమే ఉపయోగించాలి. నిర్ణీత సమయంలో ఎక్కువ గోల్స్ సాధించిన జట్టే విజేత. ప్రస్తుతం ఈ క్రీడ ప్రపంచవ్యాప్తంగా 50కి పైగా దేశాల్లో ప్రాచుర్యం పొందింది.

# నేటి నుంచి హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

- **డిసెంబర్ 19 నుంచి 29 వరకు నిర్వహణ**



**బలగం టీవీ, హైదరాబాద్**

డిసెంబర్ 19 నుంచి 29 వరకు జరగనున్న 38వ హైదరాబాద్ బుక్ ఫెయిర్ (పుస్తక పండుగ) ఏర్పాట్లపై సమాచారం అందించడానికి హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ నేడు (డిసెంబర్ 18) ఒక పాత్రికేయ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది పుస్తక ప్రదర్శనను విజయవంతం చేయడానికి విస్తృత ప్రచారం చేసి, పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చేలా చూడాలని సొసైటీ కోరింది. ఈ పుస్తక ప్రదర్శనకు సుమారు 10 లక్షల నుంచి 15 లక్షల మంది పుస్తక ప్రియులు సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. గురువారం హైదరాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు కవి యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్. వాసు, ఉపాధ్యక్షులు బాల్‌రెడ్డి, బి. శోభన్ బాబు, కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులు కె. సూరిబాబు, పి. నారాయణ రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి మాట్లాడారు.

**పుస్తక స్ఫూర్తి పైలాన్**

పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా 'పుస్తక స్ఫూర్తి పైలాన్' అనే ఎనిమిది అడుగుల స్తూపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పుస్తక పఠనాన్ని ప్రజల్లోకి, సాహిత్యకారుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు సింబాలిక్‌గా ఈ పైలాన్‌ను మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేస్తున్నట్లు సొసైటీ తెలిపింది. ఈ పుస్తక స్ఫూర్తి పైలాన్‌ను గౌరవనీయులు జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవిష్కరిస్తారు.

గౌరవ అతిథులుగా జస్టిస్ సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్సీ కోదండరామ, కే. రామచంద్రమూర్తి, రమా మేల్కోటె ప్రారంభోత్సవ సభలో పాల్గొంటారు.

**ప్రాంగణాలు, వేదికల నామకరణం**

ఈసారి మొత్తం ప్రాంగణానికి ప్రజా కవి అందెశ్రీ ప్రాంగణంగా నామకరణం చేశారు. వివిధ వేదికలు, ప్రాంగణ భాగాలకు ప్రముఖుల పేర్లు పెట్టారు. ప్రధాన వేదికను అనిశెట్టి రజిత గారి పేరున నామకరణం చేశారు. పుస్తకావిష్కరణల వేదికకు సాహితీవేత్త కొంపల్లి వెంకట్ గౌడ్ పేరు పెట్టారు. రైటర్స్ స్టాల్స్‌కు ప్రొఫెసర్ ఎస్.వి. రామారావు పేరు నిర్ణయించారు. మీడియా స్టాల్స్‌కు స్వేచ్ఛ ఒటార్కర్ గారి పేరు పెట్టారు.

**ఏర్పాట్లు, స్టాల్స్ వివరాలు**

ఈ బుక్ ఫెయిర్ ప్రాంగణంలో మొత్తం 367 స్టాల్స్‌తో ప్రారంభం కానుంది. వీటిలో ప్రభుత్వానికి సంబంధించిన 20 స్టాల్స్‌ను ఎంట్రన్స్‌లో లెఫ్ట్ సైడ్ కేటాయించారు. మీడియాకు మొత్తం 20 చిన్న స్టాల్స్‌ను చిన్న వేదికకు ఇరువైపులా కేటాయించారు. మీడియాకు ఇస్తున్న స్టాల్స్‌ను సొసైటీ ఉచితంగా కేటాయిస్తోంది. రైటర్స్ కోసం ఎంట్రన్స్‌లో రైట్ సైడ్‌లో తొమ్మిది స్టాల్స్ కేటాయించారు. రైటర్స్ సౌలభ్యం కోసం ఒక్కో స్టాల్‌కు ముగ్గురు రైటర్స్‌ను కేటాయిస్తున్నారు.

ప్రతిరోజు పుస్తకావిష్కరణ వేదికపై ఆరు స్లాట్స్‌లో పుస్తకావిష్కరణలు జరుగుతాయి. తొమ్మిది రోజుల పాటు మొత్తం 54 పుస్తకాల ఆవిష్కరణలు జరుగుతాయి.

మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు బాలోత్సవ కార్యక్రమం ఉంటుంది.

సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు భాషా సాంస్కృతిక శాఖ పంపించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు 'పుస్తక స్ఫూర్తి' కార్యక్రమాలు మూడు సెషన్లలో జరుగుతాయి. మొదటి సెషన్‌లో ప్రముఖుల సందేశాలు, మిగతా రెండు సెషన్లలో పుస్తకం విలువ, ప్రాముఖ్యత, సాహితీవేత్తల ఇష్టమైన పుస్తకాలపై చర్చలు ఉంటాయి. గత సంవత్సరం 300 మందికి పైగా సాహితీవేత్తలతో ఈ కార్యక్రమం నిర్వహించగా, ఈ సంవత్సరం కూడా అదే విధంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**కొత్త సౌకర్యాలు, మార్పులు**

పిల్లల కోసం ఆట వస్తువుల స్పేస్‌ను ప్రధాన వేదిక ఎదురుగా ఏర్పాటు చేస్తున్నారు. పెద్దలు విశ్రాంతి తీసుకునేందుకు కుర్చీలు ఏర్పాటు చేశారు. లోపలే ఫిల్టర్ కాఫీ, టీ సౌకర్యం కల్పించారు. రెండు వైపులా మెరుగైన టాయిలెట్స్ ఏర్పాటు చేశారు. పాత పుస్తకాల స్టాల్స్‌ను 60 నుంచి 40కి తగ్గించారు.

**ప్రవేశ వివరాలు**

హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు విద్యార్థులకు ఉచిత ప్రవేశం ఉంటుంది. విద్యార్థులు తప్పనిసరిగా ఐడి కార్డు తీసుకురావాలి. జర్నలిస్టులు, ప్రభుత్వ అధికారులు, సాహితీ మిత్రులు, రచయితల కోసం 20 వేల పాసులను కేటాయించినట్లు నిర్వాహకులు తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ కార్యదర్శి వాసు, ఉపాధ్యక్షుడు బాలరెడ్డి మాట్లాడుతూ, బుక్ ఫెయిర్ విజయవంతం కావడంలో మీడియా పాత్ర కీలకమని, ఈ ఏడాది కూడా సహకారం అందించాలని కోరారు. భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నామని తెలిపారు. డిసెంబర్ 24న బుక్ వాక్ నిర్వహించనున్నారు. లోయర్ ట్యాంక్ బండ్ అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమై బుక్ ఫెయిర్ ప్రాంగణంలో ముగుస్తుందని నిర్వాహకులు





# కొత్త లుక్‌లో స్మృతి మంధాన

- **తెల్లటి డ్రెస్‌లో మెరిసిన భారత్ మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

భారత మహిళా క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మరోసారి సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె తెల్లటి వన్‌పీస్ డ్రెస్‌లో ఎంతో ఆకర్షణీయంగా కనిపించింది. బుగ్గపై డింపుల్, ముఖంలో చిరునవ్వుతో ఉన్న స్మృతి ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అభిమానులు ఆమె అందానికి, ఆత్మవిశ్వాసానికి ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

గత నెలలో స్మృతి మంధాన వ్యక్తిగత జీవితంలో కొన్ని ఒడిదుడుకులు ఎదురైన విషయం తెలిసిందే. సంగీత దర్శకుడు పలాష్ ముచ్చల్తో వివాహం రద్దయిందని ఆమె స్వయంగా సోషల్ మీడియా ద్వారా వెల్లడించడంతో అభిమానులు కొంత ఆందోళనకు గురయ్యారు. అయితే ఆ కష్టకాలం నుంచి ఆమె వేగంగా కోలుకుంటోంది. ఇటీవల ఓ సందర్భంలో మాట్లాడుతూ "క్రికెట్టే నా సర్వస్వం, అదే నా మొదటి ప్రేమ" అని స్మృతి పేర్కొంది. తాజా ఫోటోల్లో ఆమె ఉత్సాహంగా, ఆత్మవిశ్వాసంతో కనిపించడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మైదానంలోనూ, మైదానం బయట కూడా స్మృతి తనదైన శైలిలో ముందుకెళ్తోందని క్రీడా వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.





# 'ఈవెంట్ ఫిల్మ్'గా అవతార్ కొత్త అధ్యాయం

- **సుకుమార్ ప్రశంసలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అవతార్ సిరీస్ తాజా చిత్రం భారత ప్రేక్షకుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. జేమ్స్ కామెరూన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ విజువల్ వండర్‌పై ఇప్పటికే దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి ప్రశంసలు కురిపించగా, తాజాగా క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ కూడా ప్రశంసల జాబితాలో చేరారు. ఇది ఒక అబ్సల్యూట్ బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందని ఆయన కొనియాడారు. కేవలం కళ్లు చెదిరే విజువల్స్ మాత్రమే కాకుండా, ప్రేక్షకులను లోతుగా కట్టిపడేసే బలమైన భావోద్వేగాలు కూడా ఈ చిత్రానికి ప్రధాన బలమని ఆయన వ్యాఖ్యానించారు. భారీ కథను అద్భుతంగా చెప్పడంలో జేమ్స్ కామెరూన్ మరోసారి తన ప్రత్యేకతను నిరూపించుకున్నారని ప్రశంసించారు. ఇది సాధారణ సినిమా కాదని, నిజమైన 'ఈవెంట్ ఫిల్మ్' అని సుకుమార్ అభిప్రాయపడ్డారు. కుటుంబంతో కలిసి థియేటర్‌లో వీక్షించినప్పుడే ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి అనుభూతిని పొందగలమని సూచించారు. అవతార్ ఫ్రాంచైజీపై భారతీయ ప్రేక్షకులు చూపిస్తున్న ఆదరణ అసాధారణమని, ఈ చిత్రం ఒక తరం గుర్తుంచుకునే గొప్ప సినీ అనుభవంగా నిలిచిపోతుందని అన్నారు. 20th Century Studios సమర్పిస్తున్న ఈ చిత్రం డిసెంబర్ 19న ఇంగ్లీష్‌తో పాటు హిందీ, తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

# ట్యాగ్‌లకంటే సినిమాలే ముఖ్యం: అడివి శేష్

**బలగం టీవీ, హైదరాబాద్**



"నా అమ్మానాన్న చిన్నప్పుడే నాకు 'అడివి శేష్' అనే గుర్తింపునిచ్చారు. అదే నాకు సరిపోతుంది. మరో ట్యాగ్ అవసరం అనిపించలేదు. పీఆర్ వ్యక్తులతో లోగోలు చేయించుకోవడం నాకు నచ్చదు. తరతరాలు గుర్తుండిపోయే సినిమాలు చేసి, ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడమే నా లక్ష్యం" అని యువ కథానాయకుడు అడివి శేష్ స్పష్టం చేశారు. అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ యాక్షన్ చిత్రం 'డెకాయిట్'లిలి టీజర్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. ఈ చిత్రానికి షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా శేష్ మాట్లాడుతూ, 'డెకాయిట్' చిత్రంలో మృణాల్ ఠాకూర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తారని తెలిపారు. సినిమాల మధ్య గ్యాప్ ఎందుకు వస్తుందన్న ప్రశ్నకు స్పందించిన ఆయన, "ఒక చిన్న టీజర్ కోసమే గంటల తరబడి కష్టపడాల్సి వచ్చింది. ప్రేక్షకులకు నాణ్యమైన సినిమా అందించాలన్నదే నా ఉద్దేశం. అందుకే ఆలస్యమైనా సరే నాణ్యత విషయంలో రాజీ పడను" అని వివరించారు. 'డెకాయిట్' చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ఉగాది సందర్భంగా విడుదల కానున్నట్లు శేష్ తెలిపారు. అలాగే ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న లిలి'గూఢచారి 2' కూడా వచ్చే ఏడాదే మరో పండగకు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించారు.పెద్ద సినిమాల మధ్య తమ చిత్రాన్ని విడుదల చేయడంపై నిర్మాత సుప్రియ మాట్లాడుతూ, కంటెంట్ బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని, సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉందని అన్నారు. గతంలో అగ్ర హీరోల సినిమాల మధ్యే 'మేజర్' విడుదలై ఘన విజయం సాధించిందని ఈ సందర్భంగా అడివి శేష్ గుర్తు చేశారు.